# కనువిప్పు

బస్‌షెల్టర్‌లో కూర్చొని బస్సు కోసం వేచి చూస్తున్నాను. నా పక్కనే ఓ తండ్రి, కూతురూ ప్లాట్‌ఫారమ్‌పై కూర్చున్నారు. ఆమె గర్భిణి స్త్రీ. పల్లెటూరు నుంచి వచ్చినట్లున్నారు.

షెల్టర్ ముందు ఒకతను బజ్జీల బండి పెట్టుకొని వేడి వేడి బజ్జీలు వేస్తున్నాడు.

ఎవరో తనకు తెలిసిన వ్యక్తి వచ్చి "శివాజీ.. వేడి వేడి బజ్జీలు ఇవ్వు" అని అడిగి తీసుకొని తింటున్నాడు.

"ఏమ్మా బజ్జీలు తింటావా? కడుపుతో ఉన్న బిడ్డను అడిగాడు తండ్రి.

"ఊ..." అంది ఆ అమ్మాయి.

అతడు జేబులో చెయ్యి పెట్టి డబ్బులు తీసాడు. డబ్బు తీసే హడావుడిలో ఓ ఐదొందల నోటు క్రింద పడిపోయింది. అది అతడు గమనించలేదు. అక్కడే ఓ ఆరేడుమంది కూడా ఉన్నారు. వారెవరూ కూడా చూడలేదు.

కింద పడి మిలమిల మెరుస్తున్న ఆ నోటును చూస్తున్న నాకు దాన్ని ఎలాగైనా కాజేయాలన్న దుర్బుద్ధి పుట్టింది. కూర్చున్న దాన్ని పైకి లేచి ఆ డబ్బు ఎవరి కంటా పడకుండా దాని మీద కాలు వేసాను ఎవరూ చూడకూడదని. తీసుకొనేటప్పుడు కూడా అక్కడున్న వారి వైపు చూసాను ఎవరైనా చూస్తారేమోనని. వాళ్లు ఒకరి మొఖాల్లోకి ఒకరు చూసుకుంటూ పిచ్చాపాటి మాట్లాడుకుంటుండగా టక్కున వంగి కాలుకింద ఉన్న నోటుని తీసుకొని జాకెట్లో దాచేసుకొని, మరోసారి వాళ్లవైపు చూసాను అనుమానంతో. ఎవరూ గమనించలేదని నిర్ధారించుకున్నాక సంతోషంగా ఊపిరి పీల్చుకున్నాను.

ఆ అమ్మాయి బజ్జీలు తిన్నాక తండ్రి వెళ్లి నీళ్లు తెచ్చిచ్చాడు. నీళ్లు తాగాక "ఇంకా ఏమైనా తినాలని ఉందా బిడ్డా" అని ఆ తండ్రి ఎంతో ఆప్యాయంగా అడిగాడు. కడుపుతో ఉన్న కూతురు కోరికను తీర్చాలనుకుంటూ.

"అక్కడ మామిడి కాయలున్నాయి చూడయ్యా" అని చెప్పింది.

బజ్జీల బండి ప్రక్కనే మామిడి కాయల తోపుడు బండి ఉంది. మామిడికాయలు కొనటానికని జేబులో చెయ్యి పెట్టి డబ్బు తీసాడు. అందులో ఐదువందల నోటు కనిపించలేదతనికి. దిగులు చెందుతూ పొరపాటున వేరే జేబులోకి పెట్టుకున్నానేమో అనుకొని పంచె ఊడదీసి డ్రాయర్ జేబులు, జుబ్బాకున్న పక్కజేబులు వెతికాడు గాబరాపడుతూ.

నీ డబ్బు నా దగ్గరుంటే నీకెలా దొరుకుతుంది అనుకున్నాను నేను మర్మగర్భంగా నవ్వుకుంటూ...

అతడు ఆత్రుతతో, ఆవేదనతో వెతుకుతూనే ముందు బిడ్డకోరిక తీర్చాలని, ఉన్న డబ్బుతోటే వెళ్లి మామిడికాయలు తెచ్చి కూతురుకు ఇచ్చాడు. ఆ అమ్మాయి ఆత్రంగా మామిడి డబ్బలను ఆరగిస్తోంది. ఈ విషయం కూతురికి చెబితే

బి. వెంకటేశ్వర్లు

కోరికను చంపుకొని తినడం మానేస్తుందని చెప్పలేక, పక్కకు తిరిగి, గుడ్లనిండా నీరు నింపుకున్నాడు.

ఆమె తినడం పూర్తయ్యాక అక్కడున్న వారిని అడిగాడు.

"అయ్యా! నాకూతురు సీమంతం కోసం చీర కొనాలని అష్టకష్టాలు పడి డబ్బు అప్పు చేసి తెచ్చాను. అందులో ఉన్న ఒక్క ఐదు వందల నోటూ ఇక్కడే పడిపోయింది. మీకెవరికైనా చిక్కుంటే ఇయ్యండయ్యా. మీకు పుణ్యముంటుంది. ఒక్కగానొక్క కూతురు పురుడు పోసుకోవటానికి వచ్చింది. దాని సీమంతం బాగా చేయాలని అప్పు చేసి చీర కొందామని వచ్చాను" అంటూ కన్నీళ్ల పర్యంతమై వేడుకుంటున్నాడు.


ఆ అమ్మాయి "ఎప్పుడయ్యా! డబ్బు పోయిందా" అని కన్నీరు మున్నీరైంది. ఎవరికైనా డబ్బు చిక్కుంటే ఇవ్వండని అక్కడున్న వాళ్లని కళ్లతోటే అభ్యర్థిస్తున్నట్లుగా ఆశగా చూడసాగింది.

అక్కడున్న వారు మేం చూడ్లేదని చెప్పారు.

ఆ తండ్రి నిరాశ, నిస్పృహలతో అక్కడే కూలబడిపోయాడు. కాని నన్ను అడిగే ధైర్యం చేయలేకపోయాడు. కారణం... నేను మధ్య తరగతి మహిళనైనా ఉన్నత కుటుంబంలోంచి వచ్చిన దానిలా తెచ్చిపెట్టుకున్న హుందాతనంతో ఉన్నాను. అందుకే నన్ను అడగటానికి జంకుతున్నట్లున్నాడు కాబోలు. నావైపు అదోలా చూస్తూ నన్ను అడగాలా వద్దా అన్న సంశయంతోనే బెరుకుతో ఎంతో వినయంగా అడిగాడు.

"అమ్మగారూ మీరేమైనా చూశారా" అని, తటపటాయించి మీరు తీసారని కాదు, ఎవరైనా తీసుకొనేటప్పుడు చూశారా? అని.

నాకు డబ్బుమీదున్న వ్యామోహంతో ఇతరుల పరిస్థితులు, వాళ్ల అవసరాల గురించి ఆలోచన చేయలేదు. అది ఎవరిదైతేనేమి ఏ కష్టాల్లో, ఇబ్బందుల్లో ఉంటే నాకేమి? ఆ డబ్బు నాకు దొరికింది. అది నా సొంతం అన్న భావనతో ఉన్న నేను... "నే చూడ్లేదు" అని ముక్తసరిగా జవాబిచ్చి మౌనంగా ఉండిపోయాను.



పోయిన డబ్బు తిరిగి రాదనుకున్న అతడు

కూతురుతో అంటున్నాడు.

"బిడ్డా ఇప్పుడేమి చేసేది?" అని.


"అయ్యా! నాకు సీమంతం సేయకపోయినా పర్వాలేదు. కొత్త చీర కొనలేదని నువ్వు బాధ పడకు. ఈసారి కాకపోతే మరెప్పుడైనా చేద్దువులే. ఇప్పుడు చార్జీలకైనా డబ్బుందా? తిరిగి మనూరెళ్దాం" అంది.

"లేదు బిడ్డా. ఆ బజ్జీల బండతన్ని అప్పుగా అడిగి చూద్దాం. మరోసారి వచ్చినప్పుడు ఆ అప్పు తీర్చేస్తాను" అంటూ అతడి దగ్గరి కెళ్తూ... అడగంగానే అతడు డబ్బిస్తాడా! నేను తెలిసిన వ్యక్తిని కాను. కనీసం ముఖ పరిచయం ఉన్న వాణ్ణి కూడా కాదు. అట్లాంటి నాకు ఏ నమ్మకంతో డబ్బిస్తాడు. అని ఆలోచించి సరే ఇస్తే ఇయ్యని... లేకపోతే నా తిప్పలు నేను పడాల్సిందే అనుకొంటూ వెళ్లాడు.

ఇన్ని అవస్తలు పడుతున్న అతన్ని చూసి అప్పుడైనా వాళ్ల డబ్బు వాళ్లకివ్వాలని నాకు అనిపించలేదు. సాటి ఆడదాన్నన్న ఆలోచన కూడా నాకు కలగలేదు.

బజ్జీల బండతని దగ్గరికెళ్లి తన పరిస్థితినంతా వివరించినట్లున్నాడు కాబోలు. అతడు అక్కడున్న వారివద్దకు వచ్చి –

"చూడండి. ఈయన ఇక్కడ డబ్బు పడేసుకున్నాడంట. ఎవరికైనా దొరికుంటే ఇవ్వండి. పాపం చాలా దూరం నుంచి వచ్చాడు. బిడ్డ సీమంతం కోసం చీర కొనాలని ఆ డబ్బు తెచ్చాడు. మనింట్లోనూ ఆడపిల్లలుంటారు. మనకూ ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఆ బాధ ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి. అతడి పరిస్థితి కళ్లారా చూస్తున్నారు. ఇప్పటికీ మీకు దయకలగ లేదంటే అసలు చీము, నెత్తురున్న మనుషులే కారు" అని అంటూ... ఎవరో వ్యాపారానికి రావడంతో తన బండి దగ్గరికి



జనవరి 22న కవిసమయం ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సభలో కె.పి. అశోక్‌కుమార్ రచించిన 'కథావలోకనం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మునిపల్లెరాజు. చిత్రంలో ఎ.కె. ప్రభాకర్, పోరంకి దక్షిణామూర్తి, అంపశయ్య నవీన్, గుడిపాటి, గ్రంథకర్త ఉన్నారు.

వెళ్లి, బేరం చూసుకుని మళ్లీ తిరిగొచ్చాడు.

అక్కడున్న వారు "నిజం చెబుతున్నాం బాబూ మేం చూడ్లేదు" అన్నారు.

ఆ అమ్మాయిని, అతన్ని ఓదారుస్తూ - "చూడయ్యా! ఇలాంటి చోటుకు వచ్చాకా మనమే జాగ్రత్తగా ఉండాలి. లోకం మారిపోయింది. నీతి, నిజాయితి, జాలి, దయ అనేవి ఎప్పుడో మట్టిలో సమాధి అయిపోయాయి. జగమంతా స్వార్థం, మనసంతా కల్మషం. మానవ సంబంధాల్లేవు. రక్తసంబంధం లేదు. మానవత్వం, మమతానురాగాలు అసల్లేవు. వీటన్నిటికీ మించింది డబ్బు. ఆ డబ్బు కోసం మనిషి ఎంత నీచానికైనా దిగజారుతాడు. అలాంటి డబ్బును ప్రాణం కంటే మిన్నగా చూసుకోవాలి. లోకంలో అందరూ అలా ఉంటారని నేను అనటం లేదు. దానధర్మాలు చేసే వాళ్లున్నారు, ఆపదలో ఆదుకునేవారున్నారు. వారే లేకపోతే ఈ లోకమే దోపిడీ మయమవుతుంది.

నీ కూతురు సీమంతం చేయలేకపోయానే అని నువ్వు బాధపడనక్కర్లేదు. నీకు కావాల్సిన డబ్బు నేను సమకూరుస్తాను. చీర, సారె అన్నీ తెచ్చి నువ్వనుకున్న ప్రకారమే సీమంతం చేద్దువు" అంటూ అతడికి ధైర్యం చెప్పి ఎదురుగా ఉన్న హోటల్ వైపు దారితీశాడు.

అతడి నోటినుంచి వచ్చిన ఒక్కో మాట ఆ చెంప, ఈ చెంప వాయించనట్లైంది నాకు.

హోటల్ వాళ్లకి, పక్కనున్న షాపుల వాళ్లకీ వీళ్ల పరిస్థితినంతా వివరించినట్లున్నాడు. వారి దగ్గర చందాలు వసూలు చేసి, తనూ కొంత డబ్బువేసి, ఆ మొత్తం తెచ్చి అతడి చేతిలో పెట్టాడు. ఇదంతా గమనిస్తున్న చుట్టూ ఉన్న జనం కూడా తమ వంతు సాయంగా తలా కొంత అందించారు. మొత్తానికి పోగొట్టుకున్న దానికంటే కొంత ఎక్కువగానే లభించింది.

ఆ డబ్బు అందుకున్న అతడి కళ్లు కాంతివంతమయ్యాయి. ఆనందంతో ఆనంద భాష్పాలు రాల్చుతూ "బాబూ! నువ్వు నిజంగా దేవుడిలా వచ్చి ఆదుకున్నావు. నా కోరిక, నా బిడ్డ కోరికా తీర్చావు. నీకేమిచ్చి రుణం తీర్చుకోను?" అంటూ రెండు చేతులెత్తి కృతజ్ఞతా భావంతో దండం పెడుతూంటే...

"మీరు పెద్దవారు. అలా దండం పెట్టవద్దు. ఈ డబ్బు నేనొక్కడినే ఇచ్చింది కాదు. ఇక్కడున్న వారంతా తలా ఓ చేయి వేసారు. అప్పుడప్పుడూ మీ లాంటి వాళ్లకు సహాయపడుతూ ఇక్కడున్న వారంతా తృప్తి పడుతుంటారు" అన్నాడు.

అప్పుడు నా మనసు కదిలిపోయింది. 'డబ్బే లోకం, డబ్బే జీవితం, డబ్బుతోనే అన్నీ కొనేయొచ్చు' అనుకున్న నాకు డబ్బుతో కొనలేనిది మమతానురాగాలు, ఆప్యాయతానుబంధాలు అని తెలిసి మానవత్వం ఉన్న మనిషిలా ఆలోచించి చురుకుగా కదిలాను. అందరి ప్రయాణీకుల మాదిరిగానే నేనూ వారికి సహాయపడుతున్నట్లుగా అయిదు వందల రూపాయల కాగితం మడిచి, అతని చేతిలోని నోట్లమధ్యలో కూరి, వెనుదిరిగి చూడకుండా ముందుకు నడిచాను.

చేసిన తప్పుకు పశ్చాత్తాపపడుతూ సిగ్గుతో తలవంచుకొని ఉన్న నన్ను అ ఇబ్బందిలో నుంచి బయట పడేయటానికా అన్నట్లు నేనెక్కాల్సిన బస్సు వచ్చి ఆగింది. జీవితంలో ఇలాంటి పనులు ఎప్పుడూ చేయకూడదని అనుకుంటూ కనువిప్పు కలిగినదానిలా వేగంగా కదిలి బస్ ఎక్కి కూర్చున్నాను.

బస్‌లో కూర్చున్న తర్వాత తల త్రిప్పి చూసిన నాకు నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్న ఆ పల్లెటూరి వ్యక్తి కనిపించాడు. ●